క్లుప్తంగా

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కలిసిన షర్మిలా రెడ్డి


మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో చర్చిస్తున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ షర్మిలా రెడ్డి

పెనుగొండ: ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలా రెడ్డి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాద పూర్వకంగా కలిసారు. సోమవారం తూర్పుపాలెంలో శ్రీరంగనాథరాజును కలిసి వైఎస్సార్ ఆసరాపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీ శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టరు మామిడిశెట్టి కృష్ణ వేణి, ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, పెనుమంట్ర ఎంపీపీ కేవీఎస్ నారాయణ రెడ్డి(వాసు) పాల్గొన్నారు.

కవి మూర్తికి జాతీయ పురస్కారం

పెనుగొండ: పెనుగొండకు చెందిన కవి, రచయిత ఎంఆర్‌వీ సత్యనారాయణ మూర్తికి పుడమి సాహితీ వేదిక జాతీయ పురస్కారాన్ని అందించింది. ఈ మేరకు సోమవారం పెనుగొండలో మూర్తి మాట్లాడుతూ ఆదివారం తెలంగాణ రాష్ట్రం నల్గొండ పెన్షనర్ల అసోషియేషన్ హాలులో నిర్వహించిన సభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు, సంస్కృత భాషల అకాడమీ చైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్టు చెప్పారు. మాజీ మంత్రి గుత్తా మోహనరెడ్డి, పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీ బాల్ రెడ్డి, మానవ హక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ డాక్టర్ సీహెచ్ హైమావతి, కర్నే శిరీష (బర్రెలక్క), జి ఉమాకర రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కత్తుల హరి సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. జాతీయ పురస్కారం అందుకున్న మూర్తిని పలువురు అభినందించారు.

పాలకొల్లు నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 1,93,379

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నియోజకవర్గ ఓటర్ల లిస్ట్ విడుదల చేశారు. సోమవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా డీఆర్వో బీవీఎస్ నారాయణరెడ్డి మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ నాటికి 1,92,337 మంది ఓటర్లున్నారని తెలిపారు. జనవరి 2024 తుది జాబితా ప్రకారం 1,93,379 ఓటర్లున్నట్టు తెలిపారు. అందులో పురుషుల సంఖ్య 95,079, మహిళల సంఖ్య 98,293, ట్రాన్స్‌జెండర్స్ ఏడుగురు ఉన్నారని తెలిపారు. మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలు పాలకొల్లు పట్టణంలో 49, పోడూరు మండలంలో 26, యలమంచిలి మండలంలో 57, పాలకొల్లు మండలంలో 58 కేంద్రాలు మొత్తం 190 పోలింగ్ కేంద్రాలున్నాయి. వివిధ రాజకీయ పార్టీల నాయకులను సమావేశంలో ఓటర్ల తుది జాబితాను వెల్లడించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వో, నరసాపురం డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.సిహెచ్ అప్పారావు, ఏఈఆర్వోలు, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, టౌన్ ప్లాన్ ఆఫీసర్ కె. వీరబ్రహ్మం, ఎన్నికల డీటీ బెజవాడ సీతారత్నం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


జగన్నాథపురంలో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మొగల్తూరు: ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ రమణ ఆదేశించారు. సోమవారం మండలంలోని జగన్నాథపురంలో కేటాయించిన జగనన్న కాలనీలో ఆయన పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాలు ఆలస్యవడానికి గల కారణాలను ఏఈ ఫణీంద్రను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫణీంద్ర మాట్లాడుతూ జగనన్న కాలనీలో కేటాయించిన స్థలం లోతుగా ఉండటంతో ఇటీవలే పూడిక పనులు పూర్తయ్యాయని, ఈ కాలనీలో రోడ్ల నిర్మాణం కూడా పూర్తి చేసామని వివరించారు. జగనన్న కాలనీకి సంబంధించి 20 మందికి ఇళ్లు మంజూరు కాగా మూడు పూర్తయ్యాయని, మిగిలిన 17 ఇంటి నిర్మాణాలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. డీఈఈ వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులున్నారు.

పంటబోదె తవ్వకం పనుల ప్రారంభం

మొగల్తూరు: శేరేపాలెంలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీరందిలా పంట బోదెల తవ్వకం పనులు చేపట్టారు. సోమవారం శేరేపాలెం నుంచి ఊరు శివారున ఉన్న జిన్నూరు కాలువ వరకు పంట బోదె తవ్వకం పనులు చేపట్టామని ఇన్‌చార్జ్ ఏపీఎం వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి పంట బోదెల ద్వారా నీరందిలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ ఆసరా

- నాలుగో విడత ఆసరా సొమ్ము జమ చేసేందుకు సన్నాహాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా గ్రూపు సభ్యులు


పెనుగొండలో డ్వాక్రా గ్రామ సమాఖ్య సమావేశం

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీకి కట్టుబడి అక్కచెల్లెమ్మలకు నాలుగేళ్లుగా ఏటా వైఎస్సార్ ఆసరాతో అండగా నిలుస్తున్నారు. ఇప్పటికే మూడు విడతల రుణ మాఫీ సొమ్ము జమ చేసిన ప్రభుత్వం నాలుగో విడత నగదు జమ చేయడానికి కసరత్తు పూర్తి చేసింది. ఈ నెల 23వ తేదీ నాలుగో విడత సొమ్ములను అర్హులైన అక్క చెల్లెమ్మల ఖాతాల్లో జమ చేయడానికి రంగం సిద్ధం చేస్తోంది. కరోనా వంటి మహమ్మారి వ్యాప్తి వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సీఎం జగన్ అక్కచెల్లెమ్మల ఖాతాల్లో సొమ్ము జమ చేసి కష్ట సమయంలో వారికి అండగా నిలిచారు. 2019 ముందు రుణాలు తీసుకొని, సక్రమంగా చెల్లించిన డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతలు ఆయా సంఘాలకు ప్రభుత్వం చెల్లిస్తూ మాట నిలుపుకొంది. ఇప్పటికే ఆచంట నియోజకవర్గంలో ఆసరా నాలుగు విడతల మొత్తం సొమ్ము రూ.172,34,40,288 అందించారు. మూడు విడతల్లో 4,288 సంఘాల్లోని, 43,050 మంది మహిళలకు రూ.129,25,80,216 చెల్లించారు. నాలుగో విడతలో రూ.43,08,60,072 చెల్లించడానికి సన్నాహాలు పూర్తి చేశారు.

నియోజకవర్గంలో ఆసరా లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారులు	గ్రూపులు	నాలుగో విడత(రూ.)	మొత్తం ఆసరా సొమ్ము
ఆచంట	12,636	1,252	12,18,85,990	48,75,43,960
పెనుమంట్ర	11,630	1,163	10,82,47,763	32,47,43,289
పెనుగొండ	12,824	1,285	14,01,05,542	56,04,22,168
పోడూరు	5,960	588	60,6,20,777	242483108
మొత్తం	43,050	4,288	43,08,60,072	172,34,40,288

ఆచంట నియోజకవర్గంలో ప్రత్యేకంగా..
మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు వైఎస్సార్ ఆసరా వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకూ పోడూరు మండలం తూర్పుపాలెంలో డ్వాక్రా మహిళలకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపనున్నారు.

ఆసరాగా నిలిచిన సీఎం జగన్


రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మూడు విడతలు ఆసరా చెల్లించారు. నాలుగో విడతకు సన్నద్ధ చేసారు. మూడు విడతల్లో రూ.36 వేలకు పైగా లబ్ధి పొందాను.
కొనకళ్ల లక్ష్మి, పెనుమంట్ర గరువు

మహిళలకు అండగా సీఎం జగన్


గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అండగా నిలిచారు. సంక్షేమం అమలుతో ఆర్థికంగా ఆదుకుంటూ తోడ్పాటునందించారు. పదవుల్లోనూ సగ భాగం మహిళలకు అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుంది. డ్వాక్రా రుణమాఫీలోనూ ఇచ్చిన మాట నిలుపుకొన్నారు.
చిల్లే లావణ్య, ఆచంట ఏఎంసీ చైర్మన్

అంగన్‌వాడీ వర్కర్లు విధుల్లో చేరిక


పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయంలో సూపర్‌వైజర్‌కి విధుల్లో చేరుతున్నట్లు లేఖ అందిస్తున్న గుబాలగుంట ఆయా వేండ్ర నాగమణి

పాలకొల్లు అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు సమ్మె విరమించి సోమవారం విధుల్లో చేరారు. పాలకొల్లు ఐసీడీఎస్ పరిధిలోని పోడూరు, యలమంచిలి, పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలాలకు చెందిన 42 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 35 మంది ఆయాలు విధుల్లో చేరారు. వీరంతా పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయంలో సూపర్‌వైజర్లకు విధుల్లో చేరుతున్నట్లు లేఖలు అందించారు. వీరు తక్షణం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి సెంటర్ తాళాలు తీసి ఫొటో అప్‌లోడ్ చేయాలని సూపర్‌వైజర్లు ఆదేశాలిచ్చారు.

విస్తృతంగా కుల గణన

మొగల్తూరు: మొగల్తూరులోని 8వ వార్డులో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సోమవారం ప్రతి ఇంటికీ వెళ్లి కులగణన సర్వే చేశారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంధర్ రేవులో వసతుల కరువు


అధ్వానంగా నరసాపురం వశిష్ఠా వలంధర్ రేవు

నరసాపురం: నిత్యం రద్దీగా ఉండే వశిష్ఠా గోదావరి వలంధర్ రేవులో కనీస వసతులు లేక అక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిసిపల్ అధికారులు ఈ విషయంలో దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో గోదావరి వలంధర్ రేవు ప్రధానమైనది. కర్మకాండలు, పూజలు నిమిత్తం దూరప్రాంతాల నుంచి నిత్యం రేవుకు అనేక మంది వస్తుంటారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో భక్తులు రేవులో స్నానాలు చేస్తారు. రేవులో కనీస వసతులు మాత్రం లేవు. ముఖ్యంగా రేవును శుభ్రం చేయడం లేదు. దీంతో రేవు నిండా బురద పేరుకు పోతోంది. దీంతో స్నానాలకు దిగిన భక్తులు రేవులో జారి పడుతున్నారు. రేవులో అస్థికలు కలిపిన కుండలు వంటివి ఎప్పటికప్పుడు తీయకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.

గతంలో అనేక ప్రమాదాలు
రేవులో 6 అడుగుల దూరం దాటి వెళితే చాలా లోతు ఉంటుంది. గతంలో అనేక మంది రేవులో గల్లంతయ్యారు. 2012లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రేవులో జారి పడి ప్రాణాలు పోగొట్టుకుంది. దీంతో విమర్శలు రావడంతో మునిసిపల్ అధికారులు స్పందించి రేవులో రక్షణగా సిమెంట్ స్థంభాలు పాతి, కంచె ఏర్పాటు చేసారు. తరువాత 2015 పుష్కరాల సమయంలో రేవులో కొద్దిపాటి మరమ్మతులు చేశారు. ప్రస్తుతం కంచె శిథిలమైంది. సముద్రపు పోటు సమయంలో స్థానికంగా రేవులో నీరు ఎక్కువగా ఉంటుంది. పాటు సమయంలో రేవులో నీరు లేక పోతే అక్కడి అధ్వాన్న పరిస్థితులు కన్పిస్తాయి. ముఖ్యంగా రేవులో తాగునీటికి సంబంధించి ఓ మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ ఉంది. ఈ విషయంలో గతంలో మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చి మరిచారు. రేవు వద్ద తాగునీరు అందుబాటులో లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఇప్పుడైనా రేవులో మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వెలివెల ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ


కందుల వెంకటేశ్వరరావును అభినందిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు తదితరులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం వెలివెల ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా కందుల వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా పనిచేసిన కెల్లా సింహాచలం అనారోగ్య కారణంగా సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా ఇప్పటివరకు ఉపసర్పంచ్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన గ్రామ పెద్దలు, అభిమానుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి
ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన కందుల వెంకటేశ్వరరావును వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శాలువాతో సత్కరించి అభినందించారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు మేకా శేషుబాబు, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, పార్టీ గౌరవాధ్యక్షుడు ఎం మైఖేల్‌రాజు, చిట్టూరి ఏడుకొండలు, గ్రామ పెద్దలు బోడపాటి వెంకటనారాయణ, మన్నె కోటేశ్వరరావు, గూడూరి వెంకట నరసింహరావు, గుమ్మాపు సూర్యవరప్రసాద్, లంకలపల్లి కొండయ్య, బోడపాటి బుజ్జి, కోటి రాంబాబు, అధికారి సత్యనారాయణ, గుమ్మాపు రవి, వీరవల్లి శివన్ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి మొల్లేటి సేవా కిషోర్, వీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కాళీపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

మొగల్తూరు: కాళీపట్న తూర్పు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి బాబ్జిరాజు సోమవారం తెలిపారు. మంగళవారం గ్రామంలోని సచివాలయ భవనంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తామని, మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో పాటు మరో ముగ్గురు స్పెషలిస్టు వైద్యులు రోగులకు వైద్య సేవలందిస్తారని తెలిపారు.

జాతరలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

నరసాపురం రూరల్: మొగల్తూరులోని కాలువ రోడ్డులో ఉన్న బోణం శివన్నారాయణ కాలిబాట వంతెన ప్రాంతంలో సోమవారం రాత్రి సత్తెమ్మతల్లి జాతరను పురస్కరించుకుని ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో పలువురికి గాయాలు కావడంతో నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి నరసాపురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి ఈ జాతరను వెలిది, బోణం కుటుంబాల ఆధ్వర్యంలో ఈ నిర్వహిస్తుంటారు. కొంత కాలంగా వారు రెండు వర్గాలుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల రెండు వర్గాల వారు వేర్వేరుగా సత్తెమ్మ జాతరను నిర్వహించుకున్నారు. జాతర ముగింపు సందర్భంగా అమ్మవారి ఊరేగింపు పూర్తి చేసుకుని గద్దె దించే ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ మరో వర్గం వారు నిలబెట్టిన అమ్మవారు ఉండటంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. నరసాపురం రూరల్ ఎస్సై గురవయ్య, మొగల్తూరు ఇన్‌చార్జి ఎస్సై అబ్దుల్ రజాక్ జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పి గద్దెను దింపేందుకు ఒప్పించారు. ఈ సందర్భంగా ఒక వర్గం వారు మరో వర్గం వారిపై కళ్లల్లో కారం చిమ్మి కొట్లాటకు దిగడంతో ఒకరికి తలపై బలమైన గాయమైంది. మరో ఇద్దరికి గాయాలు కావడంతో వారిని నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనుమంట్ర: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఆచంట అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కేహెచ్‌వీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం వెలగలేరులోని సర్పంచ్ కొవ్వూరి మధువాణి ,ఆలమూరులోని ఉపసర్పంచ్ కొవ్వూరి సుబ్బిరెడ్డి అధ్యక్షతన వికసిత్ భారత్ ప్రచారంలో భాగంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు అందజేసారు. ఆలమూరు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటనారాయణరెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి కర్రి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠతో పులకించిన భక్తులు


పెనుగొండ: జై శ్రీరామ్ ఆకృతిగా విద్యార్థులు


యలమంచిలి: మేడపాడులో భారీ స్క్రీన్ పై అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు


పాలకొల్లు అర్బన్: సీతారాముల కల్యాణోత్సవం

పాలకొల్లు సెంట్రల్: అయోధ్యలో నిర్వహించిన బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా సోమవారం రామ నామ స్మరణతో గ్రామాలన్నీ మార్మోగాయి. నగర సంకీర్తనలు, పల్లకీ ఊరేగింపులు, గ్రామోత్సవాలు, గోదావరి జలంతో అభిషేకాలు, శోభాయాత్రలు, అన్నసమారాధనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి జ్యోతి ప్రజ్వలన, బాణాసంచా కాల్పులు నిర్వహించి బాలరామునిపై తమ భక్తిని చాటుకున్నారు. పాలకొల్లులో మారుతి సెంటర్, ముచ్చర్లవారి వీధి, హౌసింగ్ బోర్డు కాలనీ రామాలయాల వద్ద ప్రజలు వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. సోమవారం విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ప్రజలు ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా వీక్షించారు. కొన్ని ఆలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. స్థానిక మారుతి సెంటర్ వద్ద రామాలయంలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామివార్లను పల్లకిలో ఊరేగించారు. స్థానిక బుధవారపు వీధి రామాలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. కొన్ని కొన్ని గ్రామాల్లో హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు ఏర్పాటు చేశారు. మారుతి సెంటర్ రామాలయ కమిటీ సభ్యులు రేలంగి నరసింహరావు, వేండ్ర సురేష్, షేక్ బాలీమా, రేలంగి సోంబాబు, చోడిశెట్టి ప్రసాద్, గజ్జరపు సురేష్, బోణం అశోక్, మండెల జిజి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా శోభా యాత్రలు
మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, శోభాయాత్రలు నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో గంగా పవన్, రామాలయంలో సుదర్శనం లక్ష్మీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొగల్తూరులో గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆలయాల్లో పూజలు, శోభా యాత్ర నిర్వహించారు.

అంతా రామ మయం
పెనుగొండ: గ్రామాల్లో అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ సందడి నెలకొంది. సిద్ధాంతం, వడలి, పెనుగొండ, ఆచంట, తూర్పుపాలెం రామాలయాల్లో పూజలు చేశారు. సిద్ధాంతంలో గ్రామోత్సవం నిర్వహించారు. పెనుగొండలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు జై శ్రీరామ్ ఆకృతిలో ఆకర్షణగా నిలిచారు. శ్రీరాముడు, సీత వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

హనుమాన్ వేషధారణతో యువకుల ర్యాలీ
పెనుమంట్ర: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం పెనుమంట్ర మండలంలో వాడవాడలా శ్రీరామానామ కల్యాణ మహోత్సవాలు, అన్నసమారాధనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల వద్ద దీపోత్సవం నిర్వహించారు. పెనుమంట్రలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు కొవ్వూరి నాగరాజ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు హనుమాన్ చిత్రంతో ఉన్న కాషాయ రంగు జెండాలను చేతబూని శ్రీరామనామ జపంతో గ్రామంలో ఉన్న 9 రామాలయాలను పాదయాత్రతో సందర్శించి చలివిడి పానకాలను పోసారు. యువకులు శ్రీరామ పరివార్ వేషధారణలతో మేళతాళాలతో పాదయాత్ర చేశారు. పురాతన పెంకుటి రామాలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు మార్టేరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారామ చంద్రమూర్తికి ఆలయ కమిటీ అధ్యక్షుడు వెలగల చినబాబు దంపతుల ఆధ్వర్యంలో ట్రస్టు బోర్డు సభ్యులంతా దంపతులతో కలిసి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెగ్గిపూడిలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎల్ఈడీ టీవీల ద్వారా వీక్షించారు. నెలమూరులో సర్పంచ్ కుచ్చర్లపాటి వెంకటపతిరాజు, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు వెంకట రామరాజు దంపతుల ఆధ్వర్యంలో దీపోత్సవంగా నిర్వహించారు.

ఎస్ చిక్కాలలో శ్రీరామ ధర్మ ప్రచార యాత్ర
పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలంలోని అన్ని రామాలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివదేవునిచిక్కాలలో పార్వతీ సమేత శ్రీ శివదేవ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతా సమేత శ్రీరాముల వారి ఉత్సవ మూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు జ్యోతులు వెలిగించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. తిల్లపూడిలో శ్రీరామాలయంలో ఘనంగా శ్రీరాముల కల్యాణం నిర్వహించారు. నడపన రమేష్, నడపన లక్ష్మయ్య, నడపన శ్రీరామ్‌బాబు దంపతులు పాల్గొన్నారు. అనంతరం గ్రామోత్సవం, భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

సర్వం..రామ మయం
యలమంచిలి: మేడపాడులో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి బాణసంచా కాలుస్తూ సోమవారం గ్రామంలో ఊరేగించారు. గ్రామ దేవత వెంకమ్మ అమ్మవారి ఆలయం వద్ద భారీ స్క్రీన్ ఏర్పాటుచేసి బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాన్ని భక్తులు తిలకించారు. బాడవ గ్రామంలో భక్తులంతా కలశాలతో గోదావరి నుంచి నీటిని తీసుకువచ్చి రామాలయంలో దేవేరులకు జలాభిషేకం చేశారు. కొంతేరులో రాములవారి పటానికి గ్రామోత్సవం నిర్వహించి పానకం, ప్రసాద వితరణ చేసారు. కంచుస్తంభం పాలెంలో రామాలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రి రామాణయం గాదతో తోలుబొమ్మలాట ఏర్పాటు చేశారు. అడవిపాలెంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గుంపర్రు గ్రామస్తులు గుంపర్రు, ఇలపకుర్రు, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం, భీమలాపురం, వల్లూరు, కాంభొట్లపాలెం శ్రీరామ శోభా యాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. రాత్రి రామాలయంలో దీపాలు వెలిగించారు.


పాలకొల్లు సెంట్రల్: మారుతి సెంటర్‌లో ప్రదర్శన


పెనుమంట్ర: హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుల ర్యాలీ


మొగల్తూరు: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు